# సామాజిక తనిఖీను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించండి

**- సమన్వయ సమావేశంలో డీవీఓ రమణారెడ్డి, ఎంపీడీఓ రవిప్రసాద్**

**- నేటి నుండి గ్రామాల బాట పట్టనున్న సామాజిక తనిఖీ బృందాలు**

ఉరవకొండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ లక్ష్మినారాయణ. చిత్రంలో డీవీఓ రమణారెడ్డి, ఎంపీడీఓ రవిప్రసాద్ ఉన్నారు.

సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సామాజిక తనిఖీ జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎంపీడీఓ రవిప్రసాద్ సూచించారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉరవకొండ మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల సామాజిక తనిఖీ కార్యక్రమంపై సమన్వయ సమావేశం ఏపీఓ విమల అధ్యక్షతన జరుగగా వారితోపాటు సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ లక్ష్మినారాయణ హాజరయ్యారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో 9,15,44,366 రూపాయలు విలువైన పనులు జరుగగా అందులో కూలీలకు 5,90,95,274 రూపాయలు, మెటీరియల్‌కు 3,24,49,092 రూపాయలు ఖర్చు చేశారని క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి వాస్తవాలు నమోదు చేయాలన్నారు. 9,10 తేదీల్లో పనులు తనిఖీ చేసి ఆపై గ్రామసభలు పెట్టి తనిఖీ నివేదికలను ప్రజల ముందు పెట్టి వారి అభిప్రాయాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ టీఏలు, ఎఫ్ఏలు, సామాజిక తనిఖీ డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం రోడ్డెక్కిన చిన్నముష్టూరు గ్రామస్థులు

**- అనంతపురం-బళ్లారి 42వ జాతీయ రహదారిలో ఖాళీ బిందెలతో బైటాయింపు - నెల రోజులుగా కుళాయిలకు నీరు సరఫరాలేక అష్టకష్టాలు పడుతున్నామని ఆవేదన**

ఉరవకొండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త



అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో ఖాళీ బిందెలతో బైటాయించి రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రజలు

తాగునీటి కోసం మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామానికి చెందిన ప్రజలు రోడ్డెక్కారు. గ్రామంలో కుళాయిలకు దాదాపు నెలరోజులుగా నీటి సరఫరా జరుగక పోవడంతో అష్టకష్టాలు పడుతున్నామంటూ అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జతీయ రహదారిలో కళ్యాణదుర్గం క్రాస్‌లో ఖాళీ బిందెలతో బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా పెద్దసంఖ్యలో వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామానికి తాగునీటి సరఫరా ఊసే లేదని అయినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఏమని అడిగితే కార్మికుల సమ్మె కారణంగా ఈ పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారని మేము ఇంకెన్నాళ్ళు ఈ కష్టాలు పడాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నెట్టం రాంబాబు రాస్తారోకో ప్రదేశానికి చేరుకొని కార్మికుల సమస్య పరిష్కారమై క్రమం తప్పకుండా నీటి సరఫరా జరిగేంతవరకు ట్యాంకర్లతో నీటి సరఫరాను కొనసాగిస్తామని భరోసా ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

## మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన ఉద్భవలక్ష్మి, దుర్గాభవాని, ఉరగాద్రి చౌడేశ్వరి, ఈశ్వరమ్మ అమ్మవార్లు

**- లలితదేవిగా దర్శనమిచ్చిన భగళాముఖి అమ్మవారు**

**- భారీగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు**

ఉరవకొండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త



మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన ఉద్భవలక్ష్మి, దుర్గాభవాని, అమ్మవార్లు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వస్తిశ్రీ క్రోదినామ సంవత్సరం ఆశ్వీయుజ మాసం శుద్ధ పంచమి మంగళవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వగా అమ్మవార్ల దివ్యమంగళ రూపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో స్వయంభూవుగా వెలసిన ఉద్భవలక్ష్మి అమ్మవారు, ఉరవకొండ పట్టణంలో వెలసిన దుర్గాభవాని, ఉరగాద్రి చౌడేశ్వరి, ఈశ్వరమ్మ అమ్మవార్లు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. అమ్మవార్ల మూలవిరాట్‌లను కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో వెలసిన భగళాముఖి అమ్మవారు లలితా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుండి రాత్రి వరకు వందలు, వేలాది మంది భక్తులు అమ్మవార్ల దివ్యమంగళ రూపాయలను దర్శించుకొని మంత్రముగ్ధులై ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో రోజువారి పూజా కార్యక్రమాలు కొనసాగగా ఆలయ కమిటీలు తీర్థ ప్రసాదాలను అందించాయి.

# మధూడి వీర భద్రస్వామిని వివిధ రూపాల్లో అలంకరణ

అగళి, అక్టోబర్ 8 ప్రభాతవార్త



వీర భద్ర స్వామిని అలంకరించిన దృశ్యం

మండల పరిధిలోని మధూడి గ్రామంలో వెలసిన పురాతన వీరభద్ర స్వామిని రోజుకో రూపంలో అలంకరిస్తున్నారు. మండలంలో ప్రముఖంగా వీరభద్రస్వామి రథోత్సవంతోపాటు అగ్నిగుండ మహోత్సవాన్ని ప్రతియేటా ఒకసారి నిర్వహిస్తారు. ఈ నెల 3న కలిశ స్థాపన, స్వామివారికి పట్టాభిషేకం, పత్తిన సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. 4న నిత్య పూజ, స్వామి వారికి కాశీ అలంకరణ, పత్తిన సేవ నిర్వహించారు. 5న నిత్య పూజ, స్వామివారికి కాశీ అలంకారం, పత్తిన సేవ, 6న నిత్య పూజ, స్వామివారికి కాశీ అలంకారం, పత్తిన సేవ, 7న నిత్య పూజ, స్వామివారికి కాశీ అలంకారం, పత్తిన సేవ, 8న సరస్వతి పూజ, స్వామివారికి కాశీ అలంకారం పత్తిన సేవ నిర్వహించారు. ఏనుగు అలంకారంతోపాటు, గుర్రం అలంకారంలో సైతం అలంకరించారు. వెండి ఆభరణాలతో స్వామిని చూడ ముచ్చటగా అలంకరించారు. ఈ నెల 14న రుద్రాభిషేకం, నిత్య పూజ, సాయంత్రం వీరభద్రస్వామి అగ్నిగుండం నిర్వహిస్తారు. 15న నిత్య పూజ, బియ్యం పూజ, మచకాశీ, మధూడి ప్రముఖ వీధుల్లో వీరభద్ర స్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ రథోత్సవం అగ్నిగుండ కార్యక్రమానికి ఆంధ్రప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు హాజరు అవుతారు.

# గొర్రెల్లో నట్టల నివారణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**- పశు బీమా గూర్చి పాడి రైతులు, గొర్రెల యజమానులకు తెలియజేయండి- పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.పి.వెంకటస్వామి**

ఉరవకొండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త



డివిజినల్ సమీక్షా సమావేశంలో పాల్గొన్న పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.పి.వెంకటస్వామి



హాజరైన ఉరవకొండ డివిజన్‌లోని పశువైద్యులు, సిబ్బంది

ఈనెల 10వ తేదీ నుండి నెలాఖరు వరకు జరిగే గొర్రెల్లో నట్టల నివారణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి జయప్రదం చేయాలని పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.పి.వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని స్థానిక లయన్స్‌క్లబ్ స్టడీ, యోగ కేంద్రంలో మంగళవారం పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డివిజన్ సమీక్షా సమావేశం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ అధ్యక్షతన జరుగగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జేడీ డాక్టర్ జి.పి.వెంకటస్వామి మాట్లాడుతూ ఒక్క అనంతపురం జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే అత్యధికంగా ఉరవకొండ పశుసంవర్ధకశాఖ డివిజన్‌లో 14.25 లక్షల గొర్రెలు ఉన్నాయని ప్రతిఒక్క గొర్రెకు నట్టల నివారణ మందు అందించాలన్నారు. దీన్నివల్ల గొర్రెల్లో ఆకలి పెరిగి మాంసం వృద్ధి చెందుతుందని, రోగ నిరోధకశక్తి పెరుగుతుందని అన్నారు. జిల్లా కేంద్రం నుండి డీవార్మింగ్ మందులను ప్రతి వైద్యశాల ఏడీలు తీసుకెళ్లాలని సూచించారు. పశు బీమా గురించి పాడి రైతులు, గొర్రెల పెంపకందార్లకు తెలియజేయాలని పాలిచ్చే పశువుల రైతులైతే 1,536 రూపాయలు ప్రీమియం మొత్తంలో రైతు తన వాటాగా 384 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని దీనివల్ల 30వేల రూపాయలు బీమా ప్రయోజనం పొందవచ్చన్నారు. గొర్రెల్లో అయితే 184 రూపాయలు ప్రీమియం మొత్తంలో రైతులు 36 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని 6వేల రూపాయలు బీమా ప్రయోజనం పొందవచ్చన్నారు. ఉరవకొండ డివిజన్ నుండి ఇప్పటివరకు 384 గోకులం షెడ్ల కోసం దరఖాస్తులు వచ్చాయని వాటి సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. పశుగ్రాసం విత్తనాలు ఎంత కావాలో, టోటల్ మిక్స్‌డ్ రేషన్ (టీఎంఆర్) విత్తనాలకు ఇండెంట్ పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ శ్రీనివాసగుప్త, డాక్టర్ పెద్దన్న, డాక్టర్ నాగలింగారెడ్డి, డాక్టర్ ఉమామహేశ్వర, డాక్టర్ శర్మ, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రాధిక, డాక్టర్ శృతి, ఉరవకొండ డివిజన్‌లోని 14 మండలాల పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడే సాధారణ సర్వ సభ్య సమావేశం

చెన్నేకొత్తపల్లి, అక్టోబర్ 8 ప్రభాతవార్త

మండల పరిషత్ అధ్యక్షులు, మజ్జిగ అంజలి, ఆదేశాల మేరకు 13వ సాధారణ, సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ, సమావేశ భవనంలో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా చెన్నేకొత్తపల్లి మండల గౌరవ ఎంపిటిసి సభ్యులు జడ్పిటిసి సభ్యులు,మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు, అలాగే గ్రామ పంచాయితీ సర్పంచులు, మండంలోని అన్ని గ్రామ పంచాయితీ కార్యదర్శులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, తమ, ప్రగతి నివేదికలతో ఈ సమావేశమునకు తప్పక హాజరు కావాలని తెలియజేశ్యారు. మండల పరిషత్ అధ్యక్షులు వారి ముందస్తు అనుమతులు లేకుండా, సాధారణ సర్వసభ్య సమావేశమునకు గైర్హాజరైతే అలాంటి అధికారులపై, తగు చర్యల నిమిత్తం సంబంధిత, శాఖాధిపతులకు, లేఖ రాయడం జరుగుతుందని తెలియజేశారు.

# కోడిపల్లిలో పొలం బడి

అగళి, అక్టోబర్ 8 ప్రభాతవార్త



పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు రైతులు

ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి, అగళి జడ్పిటిసి ఉమేష్ ఆధ్వర్యంలో కోడిపల్లి పంచాయితీలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలాలకు వెళ్లి రైతులకు అధిక దిగుబడులు, నీటి ఆదా, కృత్రిమ ఎరువులు, మందులు వాడకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పంచామృతం గురించి ఆవు, ఎనుముల ఎరువుల గురించి రైతులకు వివరించారు. అధిక దిగుబడి ఎలా సాధించాలో రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో కోడిపల్లి సర్పంచు నరసింహామూర్తి, తెలుగుదేశం పార్టీ నాయకులు రమేష్, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, ఏఓ శేఖర్‌నాయక్, వసంతనాయక్, బ్యాంకు అధికారులు, సెరికల్చర్ అధికారులు, రఘు, శ్రీరంగారెడ్డి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# గొంతు కోసుకున్న ఉన్మాది...

పెనుకొండ, అక్టోబర్ 08 ప్రభాతవార్త:



గొంతు కోసుకున్న వ్యక్తిని పరిశీలిస్తున్న సీఐ రాఘవన్

వివాహితను ప్రేమించాలని వెంటబడుతూ వేధింపులకు గురిచేశాడు. యువతి బంధువులు విషయం తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అమ్మాయిని బెదిరించడానికి ఇంటికి వెళ్లాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, బంధువులు పట్టుకొని చితక బాదడంతో ఆత్మహత్యయత్నానికి పాల్పడి గొంతు కోసుకున్న ఘటన ఇది. మండల పరిధిలోని గుట్టూరు గ్రామంలో మంగళవారం సంఘటన చోటుచేసుకుంది. గుంటూరు గ్రామానికి చెందిన గోపి అనే యువకుడు గత 8సంవత్సరాల క్రితం గుట్టూరు గ్రామానికి వచ్చి కియా అనుబంధ సంస్థలో పనిచేసుకుంటూ ఉంటూ అదే గ్రామానికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకొని నివాసం ఉంటున్నారు. చిలమత్తూరు మండలంలోని కొడికొండ గ్రామానికి చెందిన హాలీంబాషా, గోపి భార్య ఇద్దరు సోమందేపల్లి సమీపంలో కియా అనుబంధ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. వారి ఇరువురి మధ్య పరిచయం నెలకొనడంతో ఆమెను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేశాడు. దీనితో ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమెను బెదిరించడానికి మంగళవారం పవెళ్లి కత్తితో బెదిరించాడు. దీనిని గమనించిన బాధితరాలు ఇబ్బందులు గ్రామస్తులు హాలీం బాషను పట్టుకొని చితకబాదారు దీనితో మనస్థాపన గుర్రైగొంతు కోసుకున్నాడు. అతనిని పోలీసులు పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానిక వైద్యాధికారులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## చెరువులో చేపల పెంపకానికి వేలం

**అగళి, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రావుడి చెరువులో నీరు ఉన్నందున చేపల పెంపకానికి మంగళవారం రావుడి ఆంజినేయస్వామి దేవాలయం వద్ద వేలం పాట నిర్వహించారు. సర్పంచు సుజాత రామన్న, కార్యదర్శి సమక్షంలో వేలం పాట నిర్వహించగా వేలం పాటకు ఎక్కువ మంది గ్రామస్తులు హాజరయ్యారు. 70వేలకు సిద్దేశ్ అనే వ్యక్తి చేపల పెంపకానికి వేలం దక్కించుకున్నట్లు సర్పంచు తెలిపారు.

# స్పిన్నింగ్‌మిల్లును పరిశీలించిన జాయింట్ కలెక్టర్

గుంతకల్లు, అక్టోబర్ 8 ప్రభాతవార్త



స్పిన్నింగ్‌మిల్లును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

పట్టణంలోని ఆంధ్ర కో ఆపరేటీవ్ స్పిన్నింగ్ మిల్లును మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ పరిశీలించారు. మిల్లు పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ పాడైపోయిన మిషనరీని పరిశీలించారు. మిల్లు స్థలంలో అనధికారికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిల్లు స్థలానికి సంబంధించి సర్వేనెంబర్లను పరిశీలించాలని తహాశీల్దార్ రమాదేవిని ఆదేశించారు. అలాగే ఇక్కడ వాచ్‌మెన్లుగా పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. జీతభత్యాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జీతాలు సకాలంలో అందేలా చూడాలని జిల్లా చేనేత జౌళిశాఖ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తహాశీల్దార్ రమాదేవి, చేనేత, జౌళిశాఖ డెవలప్‌మెంట్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

# తహాశీల్దార్ కార్యాలయంలో సమూలమార్పులు

**-కార్యాలయం క్రమ పద్ధతిలో ఉండేలా తహాశీల్దార్ చర్యలు**

**-ప్రజాసేవలపై సిబ్బందికి దిశా నిర్దేశం**

గుంతకల్లు, అక్టోబర్ 8 ప్రభాతవార్త



తహాశీల్దార్ కార్యాలయం

గుంతకల్లు తహాశీల్దార్ కార్యాలయంలో సమూలమార్పులు చోటు చేసుకున్నాయి. నూతన తహాశీల్దార్ రమాదేవి ప్రత్యేక శ్రద్ధ వహించి మార్పులకు శ్రీకారం చుట్టారు. మొన్నటి వరకు కార్యాలయం అస్తవ్యస్తంగా వుండడమే కాకుండా ఏ అధికారి ఎక్కడ వుంటారో ప్రజలకు తెలియని పరిస్థితి. అయితే ఆగస్టు 3న తహాశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమె కార్యాలయాన్ని క్రమపద్ధతిలో పెట్టాలని నిర్ణయించారు. కార్యాలయం లోపల, బయట అందంగా తీర్చిదిద్ది ప్రజా సేవలపై సిబ్బందిని దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్రీవెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా సిబ్బందికి వేర్వేరుగా గదులు కేటాయించారు. పౌరసరఫరాలు, ఎన్నికల నిర్వహణ, కార్యాలయ నిర్వహణ, గ్రామ రెవెన్యూ అధికారులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ సిబ్బంది, మండల సర్వేయర్‌తో పాటు కార్యాలయానికి వచ్చే వారి కోసం ప్రత్యేక గదులు కేటాయించారు. వీటితో పాటు ప్రజల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. అలాగే అధికారుల ముందు నేమ్‌బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో కార్యాలయానికి వచ్చిన వారికి అధికారల పేర్లతో పాటు వారి హోదాను సులభంగా తెలుసుకునే వీలు కల్పించారు. అంతేకాకుండా సిటిజన్ చార్ట్స్‌ను, అధికారుల గదుల్లో మంచి సూక్తులు వ్రాయించారు. ప్రస్తుతం కార్యాలయం చూడముచ్చటగా వుందని కార్యాలయం సిబ్బంది, ప్రజలు తహాశీల్దార్‌ను అభినందిస్తున్నారు. ఉన్నత ప్రమాణాలు పాటించినందుకు గాను గుంతకల్లు తహాశీల్దార్ కార్యాలయం ఐఎస్ఓ గుర్తింపు పొందిందని తహాశీల్దార్ రమాదేవి ప్రభాతవార్తకు తెలిపారు. త్వరలో కలెక్టర్ చేతుల మీదుగా తహాశీల్దార్ ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకోనున్నారు.

# గుత్తి తహాశీల్దార్ కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు

గుత్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త



కలెక్టర్ నుండి సర్టిఫికెట్ అందుకుంటున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని తహాశీల్దార్ కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా గుత్తి తహాశీల్దార్ ఓబులేసు ఐఎస్ఓ గుర్తింపు పత్రాన్ని అందుకున్నారు. గుత్తి తహాశీల్దార్ కార్యాయలంలో ప్రజలకు వివిధ సౌకర్యాలు కల్పించడం, పని వేళల బోర్డులను ఏర్పాటు చేయడం, ప్రశాంత వాతావరణం కల్పించడం పట్ల ఈ గుర్తింపు లభించినట్లు తహాశీల్దార్ తెలిపారు.

# కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

గుత్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త



కార్మికులతో మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి డీజిల్ లోకో షెడ్‌లోని కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ సెక్రటరీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన డీజిల్‌షెడ్‌లోని కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరిస్తామని ఆయన కార్మికులకు హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడిఎస్ నారాయణ, రిటైర్డ్ ఎడిఎస్ మస్తాన్‌వలీ, సెక్రటరీ రామాంజులరెడ్డి, హెచ్‌జిఆర్ఎస్ బ్రాంచ్ మనోహర్, ఆఫీస్ బేరర్స్, కార్మికులు పాల్గొన్నారు.

# ధనలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

తాడిమర్రి, అక్టోబర్8 ప్రభాతవర్త



దసరా ఉత్సవాలలో భాగంగా మంగళవారం కన్యకాపరమేశ్వరి దేవి మూల విరాట్‌కు ధనలక్ష్మి అలంకరణనిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం నిర్వహించి పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించి ధనలక్ష్మి మాతగా అలంకరించారు. దీంతో భక్తాదులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పురోహితులు శ్రీకంఠ శాస్త్రి మాట్లాడుతూ.. సృష్టిలో ధనంకు ఉన్నంత ప్రాధాన్యయ మరెవ్వరికీ లేదని ఆ ధనానికి మూలమైన ప్రతిరూపమైన ధన లక్ష్మిదేవిని ప్రతి ఒక్కరు పూజించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్యులు, పలు గ్రామల నుంచి వచ్చే ఆర్య వైశ్యులు పాల్గొనగా ఆర్య వైశ్య సంఘం వారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# బసవనపల్లి వద్ద లారీ - బైకు ఢీ

అమరాపురం, అక్టోబర్ 8 ప్రభాతవార్త



రోడ్డు ప్రమాదం జరిగిన దృశ్యం

మండలంలోని బసవనపల్లి గ్రామంలోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో మంగళవారం రాత్రి లారీ, బైకు ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో బైకుపై వెళుతున్న వ్యక్తి ప్రాణాపాయస్థితిలో వున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. తీవ్రగాయాలతో రోడ్డుపై పడి వున్న వ్యక్తిని చూసి చుట్టుపక్కల వారు అతని ఫోన్ ద్వారా బంధువులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తి కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా చిక్కతిమ్మనహట్టి గ్రామానికి చెందిన తిప్పేస్వామిగా గుర్తించారు. అయితే పూర్తి వివరాలు తెలియాల్సి వుంది. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా వున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

# గుడిబండ పరిపాలన అధికారిగా గంగాధర్

గుడిబండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త



పరిపాలన అధికారి గంగాధర్

మండల పరిపాలన అధికారిగా గంగాధర్, అలాగే జూనియర్ అసిస్టెంట్‌గా రఘురాం పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతపురం నుంచి గుడిబండ మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల పరిపాలన అధికారికి జూనియర్ అసిస్టెంట్‌కు ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

# పాలసముద్రం పొలాల్లో పొలంపిలుస్తోంది



పొలాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గోరంట్ల, అక్టోబర్ 8 ప్రభాతవార్త

మండలంలోని పాలసముద్రం గ్రామ పంచాయతీలో మండల వ్యవసాయాధికారి మునికృష్ణ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు పంటలు ఏవిధంగా వేసుకోవాలి, ఏ సమయంలో ఏ మందులు వాడాలి, అదేవిధంగా అన్ని రకాల మందులు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోందని రైతులు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం రాగిమేకలపల్లి గ్రామంలోని నరసింహులు పొలంలో పంటకోత ప్రయోగంన నిర్వహించారు. గ్రామ సర్పంచు గంగప్ప, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బోయ సాధికార కమిటీ సభ్యులు బెల్లాలచెరువు చంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జ్ బిఎ మనోహర్, మూర్తి, జయచంద్రారెడ్డి, మల్లి, పుర్రోళ్ల ఆదినారాయణ, కాటేపల్లి అంజి, బాలరాజు, శ్రీరాములు, మల్లికార్జున, రామేనాయక్ (సచివాలయం అగ్రికల్చర్ చైర్ ఆఫీసర్), తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు పాలక్యాన్ల పంపిణీ

**- పాడి రైతులకు శ్రీజ కంపెనీ ఒక వరం**

**- శ్రీజ కంపెనీ జోనల్ మేనేజర్ మధుసూదన్**

గోరంట్ల, అక్టోబర్ 8 ప్రభాతవార్త



పాలక్యాన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

పాడి రైతులకు శ్రీజ కంపెనీ ఒక వరమని ఆ కంపెనీ జోనల్ మేనేజర్ మధుసూదన్ పేర్కొన్నారు. గోరంట్ల మండలంలోని మల్లాపల్లి, కలగేరి, కసిరెడ్డిపల్లి, పాలసముద్రం గ్రామాల్లో ఏరియా మేనేజర్ మల్లికార్జున ఆధ్వర్యంలో పాడి రైతులకు సంవత్సరాంతపు ప్రోత్సాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు ప్యాలక్యాన్లు, డివార్మింగ్ గులికలను ఉచితంగా అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి కేంద్రంగా నడుస్తున్న శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ పాడి రైతులకు నిత్యం తనదైన శైలిలో సేవలందిస్తోందన్నారు. నియమ నిబంధనల ప్రకారం కంపెనీకి పాలు సరఫరా చేసిన రైతులకు ఉచితంగా ఒక గ్రామానికి 11 నుండి 12 లక్షల రూపాయల వరకు బోనస్ రూపంలో చెల్లించడం జరిగిందన్నారు. అంతేకాకుండా 10 లీటర్లు, 5 లీటర్ల స్టీల్ పాల క్యారీలు ఉచితంగా అందించడం జరిగిందన్నారు. శ్రీజ కంపెనీలో సభ్యత్వ నమోదు పొంది పాల సరఫరా చేసి పాడి రైతులకు పశువుల దాణా, మినరల్ మిక్చర్, కాల్షియం, డివార్మింగ్ గులికలు, ఈగల మందు దక్కువ ధరకే పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. పాడి రైతులు పశువుల పట్ల జాగ్రత్త వహిస్తూ వుండాలన్నారు. పాల క్యారీలు, డివార్మింగ్, దోమల మందులు ఉచితంగా అందచేయడంతో వారు శ్రీజ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నారాయణస్వామి, చంద్రమోహన్, అశోక్‌కుమార్, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎంపిడిఓ రామారావుకు సన్మాన కార్యక్రమం

అమరాపురం, అక్టోబర్ 8 ప్రభాతవార్త



ఎంపిడిఓను సన్మానిస్తున్న దృశ్యం

అమరాపురం మండల నూతన ఎంపిడిఓగా బాధ్యతలు చేపట్టిన రామారావుకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో వుండి సేవ చేసే అధికారిగా రామారావుకు మంచి గుర్తింపు వుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గౌడనకుంట విశ్వేశ్వర, నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షులు జయకుమార్, యువనాయకులు నాగోనపల్లి మంజునాథ్, పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షులు మద్దనకుంట రఘు, తాలూకా బిసి సెల్ కార్యదర్శి గురుసిద్ధప్ప, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు చన్నప్ప, టిడిపి యువనాయకులు చిట్టనడుకు వివేక్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# 14 నుండి పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**-ఎంపిడిఓ రామారావు**

అమరాపురం, అక్టోబర్ 8 ప్రభాతవార్త



మాట్లాడుతున్న ఎంపిడిఓ

మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 14 నుండి 20వతేదీ వరకు నిర్వహించే పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ రామారావు తెలిపారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్‌తో జరిగిన వీడియోకాన్ఫరెన్స్ అనంతరం గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో ప్రత్యేకసమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో పనులు గుర్తించి వాటి నిర్వహణ చేపట్టేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఓఆర్‌డి నాగముని, గ్రామ కార్యదర్శులు ఈరన్న, మనోహర్‌శర్మ, నరేష్‌బాబు, మహేష్, జీవన్, ఉషారాణి, నాగవేణి, గౌరమ్మ, ఉపాధి హామీ ఏపిఓ జగదీష్, జెఇ జగదీష్, టెక్నికల్ అసిస్టెంట్లు హనుమంతరాయ, మంజునాథ్, లావణ్య, పాల్గొన్నారు.

## పొలిమేర పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

యాడికి, అక్టోబర్ 8 ప్రభాతవార్త

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అమ్మవారి ఆలయాల్లో మంగళవారం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ఉదయం యాగశాల ప్రవేశము, మహాగణపతిపూజ, గంగపూజ, నవగ్రహ జపములు హోమం, దేవి అభిషేకం, రుద్రాభిషేకం, సుందరకాండ పారాయణము, సహస్ర కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. సాయంత్రం ప్రదోషపూజ, అంకురార్పణ శతనామ కుంకుమార్చన, అమ్మోరు పల్లకిసేవ, వేద పారాయణము, స్వస్తి పఠనము, విశేష హారతులు, తీర్థప్రసాద వినియోగం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీకన్యకాపరమేశ్వరి, పెద్దతల్లికి ప్రత్యేకంగా అలంకరించారు. రాయలచెరువు గ్రామంలోని యల్లమ్మతల్లిని శ్రీమహాలక్ష్మిదేవి అలంకారంలో అలంకరించారు. పొలిమేర పెద్దమ్మతల్లి శ్రీమహాలక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రామరాజుపల్లి వద్దిరాల పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## వార్డులో దోమల నివారణకు చర్యలు


బ్లీచింగ్ చల్లిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త

పట్టణంలోని 30వవార్డు భగత్‌సింగ్‌నగర్‌లో దోమల నివారణకు వార్డు కౌన్సిలర్ మల్లికార్జున మంగళవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వార్డులో నిల్వ వున్న నీటిలో ఆయిల్‌బాల్స్ వేయించారు. అదేవిధంగా దోమలను అరికట్టేందుకు ద్రావణం పిచికారి చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం వేయకుండా ఇంటి వద్దకు వచ్చే గార్బేజి వాహనాల్లో వేయాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకుంటే దోమలు వ్యాప్తిచెందవని ఆయన తెలియచేశారు.

## శ్రీఅష్టలక్ష్మి అలంకారంలో వాసవిమాత



తాడిపత్రిటౌన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త

పట్టణంలోని మెయిన్‌బజార్‌లో వెలసిన శ్రీకన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారిశాలలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీఅష్టలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని శ్రీఅష్టలక్ష్మిగా అలంకరించారు. పెద్దఎత్తున భక్తులకు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తలుపుల సురేంద్రనాథ్, ఉపాధ్యక్షులు వంకదార చిన్నమద్దులేటి, కార్యదర్శి జయవరం అశ్వర్థరంగయ్య, సంయుక్త కార్యదర్శి భూమా సుబ్రమణ్యం, కోశాధికారి కుప్పం రత్నమయ్య, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీమహాలక్ష్మిదేవిగా వేదమాతగాయత్రి



తాడిపత్రిటౌన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సంజీవనగర్ జీరో రోడ్డులో వెలసిన శ్రీవేదమాతగాయత్రిదేవి అమ్మవారు మంగళవారం శ్రీమహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని శ్రీమహాలక్ష్మిదేవిగా అలంకరించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## శ్రీసరస్వతిదేవిగా దర్శనమిచ్చిన పార్వతిదేవి

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త



దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారు మంగళవారం శ్రీసరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నందుస్వామి, రామకృష్ణశర్మలు అమ్మవారికి కుంకుమార్చనలు, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని శ్రీసరస్వతిదేవిగా అలంకరించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

## శ్రీమహాలక్ష్మిగా దర్శనమిచ్చిన శ్రీవిజయచౌడేశ్వరిదేవి

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త



పట్టణంలోని యల్లనూరురోడ్డులో వున్న శ్రీవిజయచౌడేశ్వరిదేవి అమ్మవారు దసరా శరన్నవత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీమహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షులు హరీష్‌రెడ్డి, కన్వీనర్ పోతుల గంగాధర్‌యాదవ్, కోశాధికారి హనుమంతరెడ్డి, వాసి శేఖర్, అనంత శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేంద్ర, సాయికిరణ్, అర్చకులు విశ్వ, రామ్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

## తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

తలుపుల,అక్టోబర్08,ప్రభాతవార్త:

స్థానిక మండల వెలుగు కార్యాలయంలో మంగళవారం జరిగిన ఎంపిపి మహమ్మద్ రఫీనాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది.ప్రజా సమస్యలు చర్చించి,ప్రజలకు సేవలందించేందుకు మూడునెలలకొకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి వివిద శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు గైర్హాజరుతో నామమాత్రంగా సమావేశం జరిగింది.ఇలా అయితే ప్రజా సమస్యలు ఎలా పరిష్కరించబడుతాయని పలువురు చర్చించుకుంటున్నారు.

## మేజర్ గ్రామ పంచాయతీలో విధుల్లో చేరిన ఐదుగురు ఉద్యోగులు

- బదిలీల్లో కార్యాలయానికి పూర్తిస్థాయిలో సమకూరిన సిబ్బంది

ఉరవకొండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త



ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐదుగురు ఉద్యోగులు బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జూనియర్ అసిస్టెంట్లుగా పామిడి, యాడికి పంచాయతీల నుండి ఎం.అబ్దుల్ హుసేన్, డి.నాగరాజు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ జనార్ధన్ కొత్తచెరువు పంచాయతీకు బదిలీకాగా, సుభాన్ మరణించిన విషయం తెలిసిందే. ఖాళీగావున్న బిల్లు కలెక్టర్ పోస్టులో గోరంట్ల పంచాయతీ నుండి విజయలక్ష్మి విధుల్లో చేరగా, శానిటరీ మేస్త్రీ టి.సి.నాగరాజు పామిడి మేజర్ పంచాయతీ నుండి ఇక్కడ విధుల్లో చేరగా ఇక్కడ పనిచేస్తున్న సురేష్ పామిడికు బదిలీ అయ్యారు. నైట్ వాచ్‌మెన్ ఎస్.అనీల్‌కుమార్ పామిడి పంచాయతీ నుండి ఇక్కడికి బదిలీ అయి విధుల్లో చేరగా ఇక్కడ పనిచేస్తున్న రాజేంద్ర పామిడి పంచాయతీకు బదిలీ అయ్యారు.

## పరీక్షల నివేదికలను ఎప్పటికప్పుడు రోగులకు అందజేయండి

- ల్యాబుల తనిఖీల్లో మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.కోదండరామిరెడ్డి

ఉరవకొండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త

జ్వరాలు, ఇతరత్రా రోగాల నిర్ధారణ కోసం జరిపి పరీక్షల నివేదికలను ఎప్పటికప్పుడు రోగులకు అందజేయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.కోదండరామిరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని రాకెట్ల, పి.కౌకుంట్ల పీహెచ్‌సీల్లో ల్యాబులను తనిఖీచేసి పరీక్షల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రికి వచ్చే ఓపీ రోగుల సంఖ్య, జ్వర పీడితుల సంఖ్య, ప్రతిరోజూ సేకరించే రక్తనమూనాల సంఖ్య గూర్చి ఆరా తీశారు. ఈ క్రమంలోనే ఆయా పీహెచ్‌సీల్లో జరిగిన ఆశ డే కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన దోమల ద్వారా వచ్చే రోగాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఇల్లు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించాలని, పరిశుభ్రమైన నీటిని సేవించాలని అప్పుడే 80శాతం జబ్బులను నివారించవచ్చని సూచించారు.

## వైభవంగా బూదగవి మారెమ్మ గ్రామోత్సవం

ఉరవకొండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త


బూదగవి మారెమ్మ గ్రామోత్సవం దృశ్యం

మండల పరిధిలోని బూదగవి గ్రామంలో వెలసిన గౌరసంద్రం మారెమ్మ అమ్మవారి గ్రామోత్సవం స్వస్తిశ్రీ క్రోదినామ సంవత్సరం ఆశ్వీయుజ మాసం శుద్ధ పంచమి మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఈనెల 6వ తేదీ నుండి ప్రారంభమైన అమ్మవారి జల్దిపూజ 55వ వార్షికోత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి ఉత్సవమూర్తిని తలపై మోస్తూ భక్తులు మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాన్నం కుంభారాధన, అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి. రాత్రి గుబ్బముల ఆట, భజన కార్యక్రమాలు బుధవారం తెల్లవార్లు కొనసాగుతుండగా నేటితో అమ్మవారి ఉత్సవాలు ముగియనున్నాయి.

## రైలుకిందపడి వ్యక్తి ఆత్మహత్య

గుత్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త


వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న దృశ్యం

గుత్తి పట్టణ శివారు తురకపల్లి సమీపంలో మంగళవారం రమేష్‌బాబు (55) అనే వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తాడిపత్రి పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఇతను తన కుమారుని మరణాన్ని జీర్ణించుకోలేక మనస్థాపంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పావగడలో బిపిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ ధర్నా

పావిగడ, అక్టోబర్ 8 ప్రభాతవార్త


తహశీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బిపిఎస్ నాయకులు

పావగడ తాలూకాలోని ప్రభుత్వ బీడు భూము లను సాగు చేసుకుంటున్న రైతులకు హక్కు పత్రాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళ వారం బిపిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర ఆన నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక పిడబ్ల్యూడి గెస్ట్ హౌస్ నుంచి ప్రారంభమై తహశీల్దార్ కార్యాలయం వరకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి బిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు హరిరామ్ మాట్లాఉడతూ.. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన తాలూకాగా పావగడ గుర్తించబడిందని దాదాపు 70 శాతం పైగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారు అన్నారు. అనేక సంవత్సరాల నుంచి ప్రభుత్వ బీడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని హక్కు పత్రాల కోసం అనేక మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నమూనా 53 50 75లోదరఖాస్తు చేసుకున్న వారికి హక్కు పత్రాలను పంపిణీ చేయాలన్నారు. దరఖాస్తు చేసుకోని వారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. హక్కు పత్రాలను పొందిన వారికి రెవెన్యూ రికార్డు మ్యూటేషన్, ఆర్టిసిలను క్రమబద్దీకరించాలని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్లతో కూడిన వినతిప్రతాన్ని తహశీల్దారు వరదరాజులకు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు, కెంచరాయ, ఈరన్న, హనుమంతరాయప్ప, తిప్పేస్వామి తదితరులున్నారు.

## మట్కా బీటర్లు అరెస్ట్

- రూ.43 వేలు స్వాధీనం

గుత్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త


మట్కా బీటర్లను అరెస్ట్ చేసిన దృశ్యం

పట్టణంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్ లో మట్కా నిర్వహిస్తున్న 5 మందిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి మట్కా నిర్వహిస్తున్న నగదాని పురుషోత్తం, నగదాని శివ, రఘు, కొమ్ము ధనమయ్య, బెస్త వెంకటరాముడులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 43,250 వేల రూపాయల నగదు, 24 మట్కా చీటీలు, 5 పెన్నులు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పొట్టకూటి కోసం వచ్చి పరలోకానికి

- ట్రాక్టర్ బోల్తా ఇద్దరు దుర్మరణం,పలువురికి గాయాలు




తలుపుల,అక్టోబర్08,ప్రభాతవార్త:




తలుపుల నుంచి ఓబుళరెడ్డిపల్లెకు వెళ్ళే దారిలో పొలిమేరమ్మ గుడి సమీపంలోని మిట్ట దగ్గర కరెంట్ సామాన్లు తీసుకెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో అక్కడికక్కడే ఇద్దరు దుర్మరణం పాలయ్యారు.మొత్తం 7మంది ట్రాక్టర్‌లో ప్రయాణిస్తుండగా ఇద్దరు మరణించగా గాయాలపాలయిన వారిని 108లో కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం.వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.జార్ఖండ్ రాష్ట్రం నుంచి పొట్టకూటి కోసం వచ్చి ఇద్దరు కానరాని లోకాలకు పోయారు.తొగటవాండ్లపల్లికి చెందిన కాంట్రాక్టర్ యన్.పి.కుంట మండలం గౌకనపేట సమీపంలో కరెంట్ పనులు చేస్తుండగా తొగటవాండ్లపల్లి నుంచి కరెంట్ సామాన్లు తీసుకెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.పోలీసులు హూటాహుటిన చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోటో ఉంది: రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథలయ అదికారి

## గ్రంథాలయం రికార్డులను పరిశీలన

తనకల్లు, అక్టోబర్ 08 ప్రభతవార్త :


రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథాల అధికారి

మండల కేంద్రంలో గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ రికార్డులను ఉమ్మడి జిల్లా అదికారి పి.రమా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్షిక తనిఖీ చేయడం జరిగిందని, అందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి.రమా, గ్రంథాలయ అధికారి యస్.మస్తాన్‌వలి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపిపి ఈటె రాము

నంబులపూలకుంట, అక్టోబర్ 8 ప్రభాతవార్త

ఎన్‌పి కుంట ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి ఈటె రాము అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఇతర సమస్యలపై మాట్లాడారు.

## ఆకట్టుకున్న చిన్నారుల నృత్యప్రదర్శన


నృత్యం చేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని యల్లనూరురోడ్డు వాటర్‌ట్యాంక్ వద్ద వెలసిన శ్రీవిజయచౌడేశ్వరి ఆలయం వద్ద మంగళవారం కుందన డ్యాన్స్ అకాడమీ చిన్నారుల నృత్యప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అక్రమంగా బియ్యం పట్టివేత


రేషన్ తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్న దృశ్యం

యాడికి, అక్టోబర్ 8 ప్రభాతవార్త

మండలంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు వాహనాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ ఈరన్న తెలిపారు. ఆటో, 407 వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని డిప్యూటి తహశీల్దార్ సూర్యనారాయణ, ఆర్ఐ ఆనంద్‌బాబు, ఆచారి, గ్రామ రెవెన్యూ అధికారి అనిల్‌కుమార్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

## పండ్ల మొక్కలు నాటుకునే రైతులకు శుభవార్త

నంబులపూలకుంట, అక్టోబర్ 8 ప్రభాతవార్త

సే ట్రీ సంస్థ ద్వారా నీరు సదుపాయం ఉన్న రైతులకు మాత్రమే పండ్ల మొక్కలు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుంది. పండ్ల మొక్కల నాటుకునే ప్రతి రైతుకు బోరు ఉండాలి, అందులో నీరు ఉండాలి, ప్రతి రైతుకు ఐదు ఎకరాల లోపల భూమి ఉండాలి, పాసుబుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ ఇవ్వాలి, ఒక ఎకరాకి..156 మామిడి- 64 అంజూర్-21, జామ-35, మహాగని-26, టెంకాయ చెట్లు-10 చొప్పున అందజేయడం జరుగుతుందని వారు ఒకప్రకటన ద్వారా తెలియజేశారు.

విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు

## విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు


విద్యార్థులకు విద్య కోర్సులపై అవగాహన కల్పిస్తున్న టీచర్ సల్మాన్


హోండా షోరూంలో విద్యార్థులకు టు వీలర్ మెకానికల్ కోర్సు శిక్షణ తరగతులు

నల్లచెరువు, అక్టోబర్ 08 ప్రభాతవార్త

వృత్తి విద్యా కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలని ఏపి మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ రాణా ప్రతాప్ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ఏపి మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థినీ విద్యారుథులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇంటర్నషిప్ కార్యక్రమం ద్వారా ఆటోమోటివ్ రంగంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని 8రోజుల పాటు టీచర్ సల్మా ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కదిరి పట్టణంలోని మారుతి సుజుకి, హీరో హోండా వంటి షోరూములలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వృత్తి విద్యా పట్ల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపాలన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు స్వతహాగా జీవించడానికి వృత్తి విద్య కోర్సులు ఎంతగానో దోహదపడుతాయన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ చదవాలనుకున్న విద్యార్థులకు ఈ ఇంటర్న్ షిప్ కార్యక్రమం ద్వారా ఎన్నో ప్రాథమిక అంశాలను తెలుసుకోవచ్చన్నారు. చదువుకుంటూనే ఉపాధి కల్పించే దిశగా విద్యార్థుల్లో ఆత్మ సైర్యాన్ని నింపేందుకు ఈ ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం ఉపయోగపడుతుందన్నారు. వృత్తి విద్యా కోర్సులపై తమకు అవగాహనతో పాటు శిక్షణ తరగతులను నిర్వహించినందుకు పాఠశాల ఉపాద్యాయిని ఉపాద్యాయులకు విద్యార్థులు అబినందనలు తెలిపారు.

## మానవత్వం చాటుకున్న ముదిగుబ్బ ఎంపిపి


పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపిపి

ముదిగుబ్బ, అక్టోబర్ 8 ప్రభాతవార్త

ప్రతిరోజు అందరూ ఆరోగ్యంగా వుండాలని ఉదయం మనం లేవకముందే మన ఇంటి పరిసరాలు, వీధులను శుభ్రం చేస్తూ శ్రమించే పారిశుద్ధ్య కార్మికులకు ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణయాదవ్ తన సొంత ఖర్చుతో మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు దుస్తులు పంపిణీ చేశారు. దసరా పండుగను పురస్కరించుకుని దాదాపు 30 మంది పారిశుద్ధ్య, ఆర్‌డబ్ల్యుఎస్ కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయంలో కార్మికులను పిలిపించి వారికి దుస్తులు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నా ఏ ఒక్కరూ కూడా మమ్ములను దృష్టిలో పెట్టుకుని ఇలా పండుగకు కానుకలు ఇవ్వడం జరగలేదన్నారు. అయితే ఎంపిపి ఆదినారాయణయాదవ్ ఇలా మా కుటుంబాలకు దుస్తులు అందచేయడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ఈ సందర్భంగా వారు ఎంపిపికి కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళను హత్య చేసిన గుర్తుతెలియని వ్యక్తులు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అమడగూరు, అక్టోబర్ 8 ప్రభాతవార్త

మండలంలోని మహమ్మదాబాద్ కూడలి వద్ద కృష్ణమూర్తి మామిడితోటలో పొలం పని చేస్తున్న మహిళను గుర్తుతెలియని వ్యక్తులు రెండు రోజుల క్రితం విచక్షణారహితంగా హత్య చేశారు. ఈ సంఘటనపై జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు పుట్టపర్తి డిఎస్‌పి శివరామస్వామి, సిఐ సునీత, నల్లమాడ ఇన్‌చార్జ్ సూచనల మేరకు ఎస్ఐ వెంకటనారాయణ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సమస్యాత్మక గ్రామాలపై అప్రమత్తంగా ఉండాలి


సిఐ సత్యబాబు

యల్లనూరు, అక్టోబర్ 8 ప్రభాతవార్త

మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై అప్రమత్తంగా వుండాలని సిఐ సత్యబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన యల్లనూరు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఏవైనా సమస్యలు వుంటే ముందే వెళ్లి పరిష్కరించాలన్నారు. రౌడీషీటర్లపై నిఘా వుంచాలన్నారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి కేసుల గురించి ఎస్ఐ శ్రీరామ్‌ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు.

## నగదు హారం వేలంపాట



అనంతపురం అర్బన్ బ్యాంక్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి మహోత్సవంలో భాగంగా ఈ రోజు ఐదవ రోజు శ్రీ మహాలక్ష్మి రూపంలో అమ్మవారు అలంకరణలో వేసిన నగదు హారాన్ని వేలంపాట వేయడం జరిగింది. ఈ వేలంపాటలో 20వేల రూపాయలకు అర్బన్ బ్యాంక్ పాలకవర్గ సభ్యుడు జంగటిశెట్టి రామాంజినేయులు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మరియు పాలకవర్గ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

